కథానిక

# ఏడు బోట్లు పెట్టెలు

బి. యస్. ఆర్. కృష్ణారావు

"నమస్కారం సార్! నేను రాజమండ్రీనుంచి ట్రాన్స్ఫరయి వచ్చాను. నాపేరు గోపాలం. ఇవాళ జాయినవుతున్నాను. తమకు జాయినింగ్ రిపోర్టు ఇద్దామని వచ్చాను" అన్నాడు గోపాలం. ఇంజినీరు తలెత్తి చూశాడు. గోపాలం ఇచ్చిన జాయినింగ్ రిపోర్టు తీసుకుని చదివి, "నువ్వు దస్తూరీ బాగా ఇంప్రూవ్ చేసుకోవాలి, లేకపోతే లాభంలేదు. మూడు నెల్లలోగా నీ దస్తూరీ బాగా అయేటట్టు తయారవాలి నువ్వు. కంటికి ఇంపుగా లేకపోతే కడుపుకూడా ఇంపుగా వుండదన్నట్టు, డ్రాఫ్టు ఎట్లావున్నా రాత ముఖ్యం నాకు. కొత్తకాబట్టి నీకీ విషయం చెబుతున్నా. కాయితాలన్నీ సినిమా కాయితాల్లా విడిగా పంపించకూడదు. అట్టలో కట్టి పంపించాలి. అర్జంటు కాయితాలయితే ఎర్ర రేపరు పంపించాలి. ఆరోజు టపాలో పోవలసిన పెద్ద అర్జంటు కాయితాలయితే ఆకుపచ్చ రేపరు వేసి పంపించాలి. మామూలు కాయితాలకే రేపరూ వెయ్యక్కర్లేదు. తెల్సిందా? నువ్వు కుర్రవాడివి. అందుకని నీకు చెబుతున్నా" అన్నాడు ఇంజినీరు, జాయినింగు రిపోర్టు సంతకంచేసి ఆఫీసుకు వెళ్లే ట్రేలో వేస్తూ.

"కాపీ పుస్తకాలు కొని రోజూ దిద్దమనండి నాన్నగారూ! మరీ కొంపలు మునిగే అర్జంటు కాయితాలయితే ఆ మంతు ఫైలంతా ఎర్ర సిరాలో ముంచమనండి. లేకపోతే వచ్చినవాళ్ళ కళ్లా వాడిలి చచ్చేటట్టుగా ఇన్స్ట్రక్షన్సు. ఎప్పుడూ ఆఫీసు కాయితాల గొడవే మీకు." అని తలుపు కర్టెను తొలగించుకుని ఆఫీసు రూములో కొచ్చి మళ్ళీ చటుక్కున వెళ్ళిపోయింది మనోరమ.

"నా ఆఫీసు విషయాలు నా గుమాస్తాలతో మాట్లాడుతూవుంటే నీకంత కోపమెందుకమ్మా మమా? నీకక్కరలిస్తే డ్రైవర్ని పిల్చి కారెక్కి షికారు వెళ్ళు" అన్నాడు

"అంతేగాని నేను వస్తాను పదమ్మా అనరు కదా?" అన్నది మనోరమ పక్కగదిలోంచి.

"నీతో బాటుగా షికార్లు కొడుతూవుంటే ఆఫీసు కాయితాలెట్లా కదుల్తాయి! పిచ్చి పిల్లా, నువ్వు వెళ్ళవే" అని నవ్వుకున్నాడు తనకుతను.

"చిత్తం, అట్లాగేనండీ" అన్నాడు గోపాలం.

"సరే, ఆఫీసుకువెళ్ళి పని జాగ్రత్తగా చేస్తూవుండు. తెలీంది మేనేజరునో లేకపోతే నన్నో అడుగుతూవుండు. వెళ్ళు" అన్నాడు మళ్ళీ.

మళ్ళీ నమస్కారం చేసి వచ్చేశాడు గోపాలం. ఆఫీసు కాయితాల విషయమై ఆయన మాట్లాడుతూవుంటే మధ్య ఆపిల్ల కెందు కిదంతా? చాలా గడుసుదే మొత్తంమీద అనుకున్నాడు.

వసంత సాయంసంధ్యాకాలంలో జలపూరితమైన సరోవరానికి దగ్గిరిగావున్న లతలూ, తరువులూ వసంత సౌభాగ్యంతో కలకలలాడుతూ వుండగా, ఈ ప్రపంచంతో తనకేమీ సంబంధం లేనట్టుగా అమరలోకపు అంచుల్లో విహారిస్తున్నట్టుగా, మధ్యమధ్య సంపెంగ సౌరభమాస్వాదిస్తూ, కూనిరాగాలుతీస్తూ తూగుటుయ్యాల ఊగుతున్నది ఇంజినీరుగారమ్మాయి మనోరమ. ఆమె ఉయ్యాల తూర్పు పడమరలుగా వూగుతున్నది. వెనక భాగంలో దూరాన్నుంచి చూస్తుంటే సంధ్యారాగ రంజితమైన నిర్మల నీలాకాశం కనిపిస్తుంది. మధ్యమధ్య కోయిల తన కంఠం ఎత్తి మధురపంచమ స్వరంతో పాడుతున్నది. దానికి లయగా మనోరమకూడా 'కూ', 'కూ' అంటూ చిరునవ్వు నవ్వుతూ పాడుతున్నది. తన ఎదుట ప్రపంచంలో ఏం జరుగుతున్నదో ఆమె పట్టించుకోవటం లేదు. ప్రస్తుతం ఆమెకు కావలసిందల్లా ఆమె ఉయ్యాలా, కోయిలా, పాటలూను. నెలకు పదిహేనువందలు జీతం తెచ్చే

ఇంజినీరుగారి ఏకైక ముద్దులకుమార్తె. ఆమెకు ఏ విషయంలో దిగులుంటుంది?

గోపాలం ప్రస్తుతం చూస్తున్న సీటులోని పని చాలా కొత్తది. ఇదివరకు ఎన్నడూ చెయ్యని కొత్తపని. బండపని. రోజూ ఇరవైనాలుగు గంటలూ చేసినా తెమలదు తనకు తెలియనప్పుడు పక్కవాళ్ళ నడిగి తెల్సుకుందామంటే ఎవరూ చెప్పరు. ఆ ఆఫీసులో గుమాస్తాలంతా అదోక వింత ప్రకృతి కలవారు. ఎదటివాడు కనీసం తెల్లని చొక్కా వేసుకున్నా,గడ్డం నున్నగా చేసుకున్నా ఓర్చలేరు. ఆయనేం దొరగారి తరవాత దొరగా రంతటివా డంటారు. తమమాదిరి మాసిన గడ్డాలతో, భుజాలు చినిగిన చొక్కాలతో, నస్యంపట్టుపట్టి ఆ ముక్కు జేబురుమాలు అంటే ఏమిటో ఎరక్కపోవటంచేత భుజాలకు తుడుచుకుంటూ, కళ్ళద్దాలను పైకి ఎగదోసుకుంటూ, పగలనక రాత్రనక పని చేస్తూవుండాలి. తెలీనివాళ్ళకు తమకు తెల్సిన విషయాలు చెపితే అవన్నీ వాళ్ళు తెల్సుకుపోతారేమోనని భయం. ఇటువంటి వాతావరణంలో పని చేస్తున్నాడు గోపాలం. అర్జంటుగా గవర్నమెంటుకు పోవలసిన డిస్పోజలు సాయంత్రానికల్లా పూర్తిచేసి తీసుకురమ్మన్నాడు ఇంజినీరు గోపాలాన్ని. ఫైళ్ళన్నీ చదివి తల పగలగొట్టుకున్నా అర్థంకాలేదతనికి. ఎవర్నడిగినా చెప్పలేదు. చివరికి ఎట్లాగోట్లా రాసి పూర్తిచేసి పచ్చరేపరువేసి కోటు తొడుక్కుని ఫైలు చంకన బెట్టుకుని కాళ్ళు గజగజ లాడుతుండగా, చేతులు వణకుచుండగా, గుండె దడదడ లాడుచుండగా సాయంత్రం ఆరుగంటలకు బంగళాదగ్గర కొచ్చాడు గోపాలం.

గేటుదాటి లోపలికొచ్చేసరికి తోటలో ఎదురుగుండా ఆ స్థితిలో ఉయ్యాల ఊగుతున్న మనోరమ కనిపించింది. గుండె దడ ఆగింది. కాళ్ళ గజగజ తగ్గింది. చేతుల వణుకు పూర్తిగా పోయింది. ముఖంమీద చెమట ఆరిపోయింది. చేతులో ఫైలు ఉన్నదా లేదా అని పించింది. పచ్చ రేపరుగల ఆ రిఫరెన్సు విషయం మనస్సులోంచి తప్పిపోయింది. మెల్లిగా సిగరెట్టు తాగుతూ, పొగను సూటిగా దర్జాగావదులుతూ, తెల్లతెల్లగా ఉంగరాలుగా తిరుగుతూ మెల్లిమెల్లిగా పైకి పోయే ధూమమాలికలు చూస్తూ నిల్చున్నాడు. రెపరెపలాడుతూ మిలమిల మెరిసేటి ఆమె కనుసోయగాన్ని చూస్తూ, ఆఫీసు వాతావరణంలో ప్రవేశించి ఏనాడో మర్చిపోయిన తను చదివిన ప్రబంధ గ్రంథాలు స్ఫురణకు రాగా-ఆమె కళ్లు నల్లకలువలా, తుమ్మెద రెక్కలా లేక ఆమె మీనలోచనా. మరి చంచల నేత్రములు గల చిన్నారి మగువా అని ఆలోచిస్తూ, ఆమె ఉయ్యాల్లో కూర్చున్నతీరునీ, నల్ల త్రాచువలె నిగనిగలాడుతూ ఉన్న ఆమె వాలు జడ ముందువైపు అత్యున్నత ప్రదేశము మీద నాట్యము చేయుచుండగా ఆ సొగసునూ తిలకిస్తూ, వీణాతంత్రులను మించిన ఆమె కంఠ మాధుర్యాన్ని, ఆమె ముంజేతి గాజుల చప్పుడులోని కమనీయ మాధుర్యాన్ని విని ఆనందిస్తూ వున్న సమయంలో-

"వాటీజ్ దట్ యూ ఆర్ సీయింగ్" అనే సింహగర్జన వినిపించింది. ఆలస్యమైనందుకు చింత నిప్పులు కక్కుతూ పంట్లాము జేబుల్లో రెండు చేతులూ పెట్టుకుని బింకంగా నెపోలియన్ నిల్చున్నట్లుగా వరండాలో నిల్చుని, గోపాలంమీది కోపాన్నంతా పొగరూపంలో వెళ్ళగక్కుతున్నాడా అన్నట్లుగా, 'పైప్' లోనుంచి పొగ వదులుతున్న ఇంజనీరుని చూశాడు గోపాలం. ప్రబంధకావ్యంలోని మాటలు ఎగిరిపోయినయి,- కోటు గుండీలు సరిగ్గా పెట్టుకున్నాడు. మళ్లీ గుండె దడదడా, కాళ్ళ గజగజా, చేతుల వణకూ మొదలు పెట్టినయి. నేనూ ఉన్నా నన్నట్లుగా పచ్చరేపరుగాలికి రెపరెపలాడింది. గౌరవపూర్వకంగా ఫైలు చేతిలోనే పెట్టుకుని ఒక్క నమస్కారం పెట్టాడు గోపాలం-

"అయిపోయిందండి" అన్నాడు గొంతు పెగుల్చుకుని.

"దెన్ కమాన్, వై డు యు స్టాండ్ దేర్" అని ఆఫీసు రూములోకి వెళ్ళాడు ఇంజినీరు. వరండాలో నిల్చుండటం నుంచి మనోరమ ఆయనకు కనబడలేదు. గోపాలం ఊరికేనే అక్కడ నిల్చున్నాడని అనుకున్నాడు. తండ్రి మాటలు విన్నది మనోరమ. ఉయ్యాలా దిగి నిల్చుని నడుంమీద రెండు చేతులూ గట్టిగా పెట్టుకుని ముఖం సీరియస్‌గా పెట్టి - "ఆ డిస్పోజలు

యమర్జంటు. ఆ ఫైలుకు అమాంతం ఎర్రసిరాలో ముంచావా?" అని బింకంగా అని పక్కన నవ్వి చిన్నగా చప్పట్లు కొడుతూ ఇంట్లోకి పరుగెత్తింది మనోరమ.

"ఖర్మ - ఎంత లోకువైపోయినాను" అని మనస్సులో అనుకుని చకచకా ఆఫీసు గదిలోకి వెళ్ళిపోయాడు గోపాలం. ఆరోజు రాత్రి చివాట్లతో డ్రాఫ్టు పూర్తి చేయించుకుని పది గంటలకు ఇంటికి వెళ్ళాడు గోపాలం కాళ్ళీడ్చుకుంటూ.

నాలుగు రోజులు పోయింతరువాత ఒకనాడు ఉదయం ఏడు గంటలకల్లా రమ్మన్నాడు ఇంజనీరు గోపాలాన్ని ఏవో కాయితాలు తీసుకుని. గోపాలం యథాప్రకారంగా వెళ్లాడు కాయితాలు తీసుకుని. వాకిట్లో జవాన్లు లేరు. వెళ్లి ఆఫీసు రూములో కూర్చున్నాడు. ఇంజనీరు ఇంకా రాలేదు. మళ్లీ ఏం చివాట్లు తగుల్తాయో అని భయపడుతూ ఫైలు తీసి చదువుతూ కూర్చున్నాడు.

తలుపు తీసిన చప్పుడయింది. గోపాలం గుండె గతుక్కుమంది. కోటు బొత్తాలు సవరించుకుని లేచి నిల్చున్నాడు.

"నాన్నగారనుకున్నారా?"

తలెత్తి చూశాడు. మనోరమ గుమ్మం దగ్గర నిల్చుంది. ఆయన చూస్తే తన పని ఏమవుతుందోనని భయపడుతున్నాడు గోపాలం.

"నాన్నగారు ఇంకో గంటదాకా నిద్ర లేవరు. రాత్రి కాయితాలు చూస్తూ చాలాసేపు మేలుకున్నారు. మిమ్మల్ని పొద్దున్నే రమన్నారా?" అంది మనోరమ.

"అవును, రమ్మన్నారు. అందుకే వచ్చాను" అన్నాడు ముభావంగా.

"ఈ అధికార్లు అంతా అంతే. తమ అధికారిత్వమంతా తమ తాబేదార్లమీద చూపిస్తూ వుంటారు. ఇప్పుడు చూడండి - పొద్దున్నే మిమ్మల్ని రమ్మన్నారు. ఆయనింకా నిద్ర కూడా లేవలేదు. ఇంజనీరుగారు రమ్మన్నారని మీరు అయిదు గంటలకల్లా లేచి స్నానం చేసి ఫైళ్లు చదివి భయపడుతూ భయపడుతూ వచ్చారు. అవునా?"

తల ఊపాడు.

"రాజకీయాల్లో సామ్రాజ్యవాద పరులూ, పెట్టుబడిదారుల బుద్ధీ ఎట్లా వుంటుందో అధికార్ల దృష్టి తాబేదార్ల విషయంలో అట్లా వుంటుంది. తమకన్న ఎక్కువ సంసారపు జంజాటనా, పిల్లలగొడవా వుంటుందనీ. అన్ని పన్లూ వాళ్లే చేసుకుంటూ వుండాలనీ ఈ ఆఫీసర్లకు ఇంగిత జ్ఞానం ఏమీ ఉండదు."

తనను పరీక్షించటానికి అట్లా అంటున్నదా లేక తనబోటి వారిమీద సానుభూతి చూపించటమా అని తికమక పడుతున్నాడు గోపాలం. ఆమె మాటలకు ఏదో సమాధానం చెబుతూ, అవకతవకగా అధికార్ల నిరంకుశత్వాన్ని గురించి తనూ మాట్లాడితే ఈ సంగతి ఆమె తండ్రితో చెబితే తనపని ఏంకావాలి?

"ఏదోలెండి ఎవరి అభీష్టం వారిది. అంతా అందల మెక్కితే మోసేవారు మాత్రం ఎవరుంటారు?"

"నిల్చునే మాట్లాడుతున్నారు. కూర్చోండి. మీరు పట్టభద్రులేనా?"

"అవును."

"పాపం! ఆంగ్ల విద్యాలయాల్లో విద్య నభ్యసించి ఆస్తిపాస్తులను కర్పూరహారతిలా వెలిగించి వేరే పనిపాటలు ఏమీ చేతగాక గానుగెద్దుల్లాగా ఈ గుమాస్తా ఉద్యోగాలకు తయారయే ఈ గుమాస్తాలని చూస్తే నాకు చాలా విచారం కలుగుతుంది. ఈ నలభైఅయిదు రూపాయిల్లో భార్యా బిడ్డల్ని ఈ కరువుకాలంలో ఎట్లా పోషిస్తున్నారో నాకు అగమ్యగోచరంగా వుంది. అంటున్నానని కోపగించుకోకండి. మీకు నెల మొత్తంమీద వచ్చే జీతము మాబోటి వాళ్లిళ్లలో ఒక్క రోజు కట్టుడు చీర ఖరీదు చెయ్యదు."

గోపాలం తల వంచుకున్నాడు. ఇదేమిటా ఈ పిల్ల ఇట్లా మాట్లాడుతున్నది, ఆయన చూస్తే ఏమనుకుంటాడో అని భయపడుతున్నాడు.

"నాన్నగారు వచ్చింతరువాత వస్తా లెండి- వెళతాను."

"కూర్చోండి. మీ ఉద్దేశం నాకు అర్థమయింది. నాన్నగారు చూస్తే ఏమంటారోనని మీరు భయపడుతున్నట్లుగా వున్నారు. నా అంతట నేమాట్లాడుతున్నాగాని మీరుకావాలని నాతో మాట్లాట్టంలేదు కదా? ఈపూట బజారు

వెళ్ళి కూరకూడా తెచ్చుకోకుండా చేశారు నాన్న.”

“నాకు వివాహం కాలేదండి. హోటలు భోజనమే; అంచేత బజారు ప్రమేయం లేదు నాకు.”

మేడమీదనుంచి ఎవరో దిగుతున్న చప్పుడయింది. మనోరమ వెళ్ళిపోయింది లోపలికి.

“ఎంత సేపయింది, గోపాలం, వచ్చి?” అన్నాడు ఇంజినీరు కుర్చీలో కూర్చుంటూ.

“ఇప్పుడేనండీ, పావుగం టవుతుంది.”

“రాత్రి చాలాసేపు కాయితాలు చూస్తూంటంచేత ఆలస్యంగా నిద్రలేచాను. ఇంకా స్నానం అదీ అవలేదు. ఇంకోప్పుడు చూద్దాంలే. వెళ్ళిరా” అని మళ్ళీ వెళ్ళిపోయాడు మేడమీదికి. గోపాలం ఉసూరుమంటూ బయటికొచ్చేశాడు.

ఇదివరలో ఆమెను చూసినప్పుడు ఆమె సౌందర్యానికి ముగ్ధుడయాడు గోపాలం. ఇప్పుడు తనతో మాట్లాట్టమే కాకుండా తన జోటి గుమాస్తాలమీద సానుభూతి చూపిస్తూ అధికార్ల నిరంకుశ విధానాన్ని ఖండిస్తూ మాట్లాట్టంనుంచి ఆమె చాలా దయాపరురాలని గ్రహించాడు కాని పరాయిమగవాడితో, అందులో తండ్రి ఆఫీసులో ఒక చిన్నగుమాస్తాతో ఇంత ఇదిగా మాట్లాట్టానికి గల కారణం ఏమిటో అతనికి అర్థం కాలేదు.

మర్నాడు సాయంత్రం ఇంజినీరు రమ్మని చెప్పక పోయినప్పటికీ గోపాలం వెళ్లాడు, కాయితాలకట్ట చంకన బెట్టుకుని. మనస్సు పరిపరి విధాల పోయింది. అధికారమదాంధకారంలో కొట్టుకుంటున్న ఆ తండ్రికీ, తమకున్న ధనరీత్యా, అధికారరీత్యా తక్కువ తరగతి వారియందు, అందులో తన తండ్రి ఆఫీసులో గల గుమాస్తాల విషయంలో ఇంత చనువుగా చిరపరిచితురాలివలె మాట్లాట్టమే గాకుండా సానుభూతి చూపించే దయార్ద్ర హృదయుతాలు ఎట్లా కలిగిందో అతనికి ఆశ్చర్యం కలిగింది. అదృష్టహీనులకు తాను పాపై కరచినవిధాన ఆమె కరుణారసపూరితమైన మాటలే తన కొంప తీస్తాయేమోననే భయము ఒకవైపు కలిగేసరికి, తాచుపాము పడగనీడలో కప్ప సేద తీర్చుకున్న సామెతగా అవుతుందేమో తనపని అనుకున్నాడు.

గేటుదాటి లోపలకు వెళ్ళగానే మనోరమ మేడమీద కనిపించింది. ఆమె ముఖం చాలా చిన్నబోయినట్లుగా వుంది. మేడమీదనుంచే ఒక్కతడవ గోపాలంవైపు చూసి వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది. ఆ చూపులో సానుభూతి, దయ, జాలత్వమూ, ఏదో ఒకవిధమైన దిగులు మిళితమై గోపాలం మనస్సుకు పెద్ద ఆలోచనను కలుగచేసింది. లోపలికి వెళ్ళకుండానే తిరిగి వచ్చేశాడు కాళ్ళీడ్చుకుంటూ.

వారం పదిరోజులు గడిచిపోయినాయి. ఇంజినీరుగారమ్మాయి మనోరమ పెళ్లన్నారు. ఆఫీసులో గుమాస్తాలంతా పనికూడా మానుకుని ఇంట్లో పెత్తనం చేస్తున్నారు. ఆఫీసులో ఒకొక్క బ్రాంచి పని ఒకొక్కరికిచ్చినట్టుగానే పెళ్లి పనుల విషయంలోకూడా అందరికీ తలోపనీ పురమాయించారు. గోపాలంకూడా ఏవోపన్లు చేస్తూనే ఉన్నాడుగాని అతనిమనస్సు మనస్సులో లేదు. ఏదో వెలితిగా, హృదయం కలచినట్లుగా, దిగులుగా భయంగా వున్నాడు. పెళ్ళిపన్లు సాగిపోతున్నాయి.

పెళ్లికొడుకుతో బుట్టువులు ఏడుగురు, మొగపిల్లా డతనొక్కడే. అతనూ ఎక్కడో జూనియర్ ఇంజనీరు చేస్తున్నాడు. పాతికవేల కట్నం. పానకం బిందెలు, బొట్టుపెట్టెలు, కాటుకాయలు, కుంకంభరిణలు, కాళ్ల గడుగుపళ్లెం ఇట్లాంటివన్నీకూడా వెండివే. వియ్యమొందుతున్న ఇద్దరూ పెద్ద ఇంజినీర్లే. పెండ్లికొడుకూ ఇంజినీరే. మొగపెళ్లివారు కోరిందల్లా ఇస్తానన్నాడు మనోరమ తండ్రి.

మగపెళ్ళివారు స్నాతకం విడిదిలోనే చేసుకుంటున్నారు, నదిదాటి రావటంనుంచి పనికిరాదని. స్నాతకం అవుతున్నది. ఆపెళ్ళికొచ్చిన వాళ్లలో ఒక అలజడి బయల్దేరింది - ఆడబడుచు లాంఛనాలన్నీ ఏడేసి తెచ్చారు కాని వెండి బొట్టుపెట్టెలుమటుకు ఆరుమాత్రమే తెచ్చారని. ఇది ఆనోటా ఆనోటా పాకిపోయింది. పెళ్ళికొడుకు తల్లికూడా విన్నది. అక్కడనుంచీ ఆవిడ మొదలు పెట్టింది.

"ఇంతమందిలో మమ్మల్ని చిన్నతనం చేయాలనుకున్నారు అంత బొట్టుపెట్టె కొనలేనివాడూ, ఇవ్వలేనివాడూ సంబంధం ఎందుకు చెయ్యాలి? పెద్ద ఇంజినీరు చేస్తున్నాడే - నాయేదో పిల్లకు బొట్టుపెట్టె ఎందుకు తేలేదు? మంచి, మర్యాద గల వంశ మనుకున్నాను. ఇంత సామాను కొని, మమ్మల్ని చిన్నతనం చెయ్యటానికి కాకపోతే, బొట్టుపెట్టె ఎందుకు కొనలేదు? ఇంత పరమలోభి అనుకోలేదు" అని సాగించింది. ఈ విషయం అనోటా అనోటా పడి మనోరమ తండ్రిదాకా పోయింది. ఇంక ఆయన శోకతొక్కిన తాచు మాదిరి లేచి——

"ఇన్నివేలు కర్చుచేయగా లేంది ఒక్క బొట్టుపెట్టెకు చూసుకుంటామా? ఏదోది కొనుక్కురానిమాట నిజమే. ఈసామాన్లు కొనే సందడిలో ఏదోది తీసుకోటం మర్చిపోయాము. అంతేగాని వాళ్ళని చిన్నతనం చేయటానికి, అవమానం చేయటానికినా? అంత బొట్టుపెట్టెలలోనే మర్యాదలు పోయే కొంపలో నా కూతురు ఎన్నాళ్ళు కాపరంచేస్తుంది - వీళ్ళంతా కలసి దాన్ని కాల్చుకుతినరా? బొట్టుపెట్టె మర్చిపోయినారట, ఏదోది తెప్పించండని చెపితే ఎంత బావుండేది - అయినా వాటి ప్రమేయం వచ్చినప్పుడు నాతప్పు తెల్సుకొని అప్పుడే తెప్పిద్దును కదా? ఇటువంటివాళ్ళకి నేను నాపిల్లను ఇవ్వనే ఇవ్వను" అని రౌద్రాకారం దాల్చి పెళ్ళికొడుకువాళ్ళకు పెళ్లిచెయ్యనని కబురుచేశాడు. ఇరువైపులవారికీ పెద్ద సంఘర్షణ జరిగింది. ఫలితం పెళ్లి ఆగిపోయింది. పెళ్ళికొడుకు వాళ్ళు హోటలు భోజనం తెప్పించుకుతిని తిరుగు ప్రయాణానికి సిద్ధమయారు.

లగ్నం రాత్రి ఏడుగంటలకి. ఈ తగాదాలు ఆయేసరికి మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. ఇంజినీరుగారికి సివమెత్తినట్టయింది. పెళ్ళి ఈవిధంగా తప్పిపోయేసరికి మనోరమ ముఖాన కత్తివేస్తే నెత్తురుచుక్క లేదు. మనోరమ తల్లి కిందపడి దొర్లి ఏడుస్తున్నది- ఇంత గంద్రగోళం జరిగితే ఇంక ఈ జన్మలో పెళ్ళి ఎట్లా అవుతుందని. గుమాస్తాలంతా హడిలి పోతున్నారు. మధ్యలో తామేదంటే ఆయన ఏమంటాడోనని. అక్కడి పరిస్థితులన్నీ నావారభసగా వున్నాయి.

మగ పెళ్ళివారు అంతా వెళ్ళిపోయారు. సాయంత్రం ఆరుగంటలయింది. సవ్యంగా జరిగితే మరోగంటకు పీటమీద కూర్చోవాలి. ఇంజినీరుగారు పడక కుర్చీలో కూర్చొని ఆలోచిస్తున్నాడు. గోపాలం సామాను కొట్టుకు తాళం వేసి తాళం చెవులు ఆయనకు ఇవ్వటానికి వస్తున్నాడు. గోపాలంవైపు ఎగాదిగా చూసి ఒక్క చిన్న నవ్వు నవ్వాడు. గోపాలం హడిలిపోయినాడు, ఇదేమిటా అని.

"గోపాలం, మీ అమ్మగారూ, వాళ్లూ ఎక్కడున్నారు?"

"నాకు తల్లిదండ్రు లెవరూ లేరండి - మేనమామల ఇంట్లో పెరిగాను. వాళ్లు కాకినాడలో వున్నారు. అంతకన్నా నా కెవరూ లేరు." అన్నాడు బెరుగ్గా - ఇదంతా ఎందుకు అడుగుతున్నాడా అని.

"మంగళ స్నానాలకి తయారవు. ఏదో బొట్టుపెట్టె మినహా అన్నీ నీవే. ఏదో బొట్టుపెట్టె అసలు తీసుకురాను. మనోరమను నీ కిచ్చి చేస్తాను" అని ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

గోపాలం కళ్లు అప్రయత్నంగా సంధ్యాంధకారంలో కలసిపోతున్న ధూమలతికల వెనువెంట ఆకాశానికి ఎగిరి కొత్త సుందరలోకాలు తిలకిస్తున్నాయి.